# గుండె పగుళ్ళు

★ రచన: వేదుల లక్ష్మీగణపతిశాస్త్రి ★

నాగన్న గరువుమీదనున్న చింతక్రింద నుంచుని, తనపొలం నాలుగుమూలలా ఒక్కసారి కలయజూసాడు. యెగువచెక్కల్లో పెద్దకొడుకు కర్రిగిత్తల్ని కట్టి, దున్నుతున్నాడు.

పాపం! రాత్రనక పగలనక, బద్ధకమంటే యేమిటో తెలియనట్లు, శరీరాన్ని దాచుకోకుండా, అలాగే.... యెప్పుడూ పనిచేస్తూనే వుంటాడు:

అవును. తనుమాత్రం వయస్సులో యెంతెంత పని చేసేవాడు!' యేవేవో ఆలోచనలు దొంతర్లుగా నాగన్న మనస్సులో పరుగులుపెట్టడం ప్రారంభించాయి. బరువుగా నాలుగుఅడుగులేసి, యేతాని కని కొట్టించిన మలరాడుమీద కూర్చున్నాడు. చేతిలోనున్నకర్రని జేర్లా వేస్తూ అనుకున్నాడు. తన పదమూడవయేట వెంకయ్యకాపు కొనిచ్చినకట్టు, యింతవరకూ చెక్కుచెదరకుండా ఉన్నందుకు సంతోషపడ్డాడు. వెంకయ్యకాపుదగ్గర తాను చేరినప్పటినుండి, యింతవరకూగడచిన తన జీవితమంతా ఒక్కసారిగా తన కళ్ళముందు తిరగడం ప్రారంభించింది:

తాను మొట్టమొదటిసారిగా యీవూరు వచ్చినప్పుడు, వెంకయ్యకాపు తనకు కొంత సహాయంగా వుంటాడని చేరదీసుకున్నాడు. అప్పుడు తనకి మూడుపూటలా అన్నంపెట్టి, నెల కైదు రూపాయలుయిచ్చేవాడు, తానూ - ఒక్క నిముషమైనా వూరికేకూర్చోకుండా, యేదో ఆపని - ఈ పనీచేస్తూనే ఉండేవాడు, క్రమక్రమంగా వెంకయ్య కాపు కులాభిమానంచేతనైతేనేం - తన ఓర్పు, నమ్మకంవల్లనైతేనేం - అభిమానంకలిగి తన యింట్లోవాడిలాగే చూచుకుంటూ వచ్చాడు. తాను లేనప్పుడు యింటివిషయాలు తనకే వప్పజెప్పేవాడు. తను యెంతోనేర్పుతో యజమానిలేనిలోటు కనిపించనీయకుండా - యివతలయింటిపనులూ.., అవతల పొలంపనులూగూడా బహుజాగ్రత్తతో చూచుకుంటూండేవాడు. వెంకయ్యకాపుకి ప్రతి పనిలోను 'తల్లోనాలికలాగున' సాయపడుతూండేవాడు, దుక్కిదున్నేటప్పుడు, కుప్పనూర్చేటప్పుడు కూడా నాగన్నలేందే - యేప మొదలుపెట్టేవాడు కాదు వెంకయ్యకాపు; పనిచేయించడంలో నాగన్నకున్న చురుకు, నేర్పు, వెంకయ్యకాపుని బాగా ఆకర్షించాయి, అందుచేతనే క్రమంగా బాగుచేసుకుని, తనకున్న వొక్కగాని ఒక్కకూతుర్నీ యిచ్చి, పెళ్ళిచేసి - యిల్లరికం వుంచుకున్నాడు; తనకున్న యెనిమిది యకరాల జిరాయితీనీ చూచుకునే బాధ్యతకూడా, నాగన్న నెత్తిమీదే పెట్టాడు.

ప్రొద్దున్నే నాగన్న తొలికోడి కూసేటప్పటికి లేచేవాడు. గోలెంనిండా చిట్టుకలిపి, కొట్టంలోని తెల్లగిత్తల్ని రెండిటినీ వదలేవాడు. అవి చిట్టు తినేలోగా—బండినిండా పెంటవేసుకుని, రోడ్డుమీద సిద్ధం చేసుకునేవాడు, 'చుక్కమ్మ' ఈలోగా తనకు పైమీదిపంచె, చూరులోని కొరడాకర్ర తీసుకుని, ఓచేత్తో అద్దాల్లాంతరుపట్టుకుని, యెదు

లొచ్చేది. నాగన్న సందుమలుపు తిరిగేవరకూ, చిరుగంటలమోత వింటూనే అలాగేనిలబడిపోయేది చుక్కమ్మ. చిన్నప్పటినుండీ వాళ్ళనాన్న యింటి దగ్గర లేనిసమయాల్లో, నాగన్నతోనే కాలాక్షేపంగా కబుర్లుచెబుతూ, ఆపనీ - ఈపనీ, కాస్త సహాయంగా చేస్తూ, యేందో యిష్టంగావుండేది. ముంజికాయలకాలంలో నాగన్న కొట్టియిస్తోంటే యేవేవో కబుర్లుచెప్పి, నవ్విస్తూ కాయలన్నీ ఖాళీ చేసేది.

నాగన్న యెప్పుడూతనతోటి ముంజికాయలు తినడంలేదని ఓసారితాను కొట్టి చేతికందిస్తున్న చుక్కమ్మ వెర్రిగా కబుర్లమధ్య - యెక్కసంగా త్రేన్పే తన కేసిచూస్తూ - చేతిమీదవేటేసుకుంది. నాగన్న వెంటనే తలపాగాచించి ముగ్గేసి కట్టు కట్టాడు. తనమూలంగానే చుక్కమ్మకి యింత దెబ్బతగిలిందని యెంతోబాధపడుతూ వచ్చాడు. వెంకయ్యకాపు తన్నేంచేసిపోతాడోఅని యెంతో భయపడ్డాడు, కాని చుక్కమ్మ ఫరవాలేదని వాళ్ళ నాన్నచేత నచ్చచెప్పింది. అదే యిప్పటికీ చుక్కమ్మ ఎడంచేతి చూపిడివేలుమీద పెద్ద నాటు కనిపిస్తుంది.

పెళ్ళిముచ్చట్లు తలపురావడంతోనే ఒక్కసారిగా అప్రయత్నంగా నాగన్న పెదవులమీద చిరునవ్వు తాండవమాడింది.

బరువునంతా యీచట్టమీదనుండి ఆవైపుకు మార్చుకు కూర్చున్నాడు :

'వెంకన్న' పుట్టుగులకు వాళ్ళతాత యెంతో ఘనంగా బారసాలచేశాడు. తనపేరు పెట్టాము కదా అని యెంతోప్రేమగా - అస్తమానూ యెత్తుకుని తిరిగేవాడు తాత వెంకయ్య. యెప్పుడో గాని చుక్కమ్మదగ్గరకు పోనిచ్చేవాడేకాదు. కాస్త జ్ఞానం వచ్చినప్పటినుండి పొలంపనుల్నిగూర్చి - పనిముట్లనుగూర్చి - మనుమడికి కథల క్రింద చెప్తూతూండేవాడు. ఆరోయేడు వచ్చిందిమొదలు తనతోకూడా బండిమీద పొలానికి తీసుకొనివెళ్ళేవాడు. చేయించవలసిన పనులన్నీ నాగన్నకు పురమాయించి మెల్లిగా బయలుదేరేవాడు. దారిలో కనుపడ్డ ప్రతివాళ్ళతోనూ యేదో ఆకబురూ - ఈ కబురూ చెపుతూ మధ్యాహ్నానికి యిల్లు చేరుకునే వాడు.

అలాగ తాతదగ్గర తర్ఫీదు పొందినందువల్లనే తన పెద్దకొడుకు వెంకన్న పొలంపనుల్లో ఆరితేరాడు :

యిల్లూ పాడి చుక్కమ్మమీద ; పొలం వ్యవహారాలన్నీ తనమీదా విడిచిపెట్టినా వెంకయ్యకాపు యెప్పుడూ ఖాళీగా కూర్చునేవాడుకాదు. యేదోపనిచేస్తూనే వుండేవాడు, నాగన్న మూడో కుర్రాడు సుబ్బారావుకు ఎనిమిదోయేడు వచ్చే వరకూ వెంకయకాపుకే జబ్బూలేదు. ఆటువంటి వాడు నాలుగురోజులు మంచంమీదఉన్నాడోలేదో ఓరోజున చుక్కమ్మనీ తన్నీ కేకేసి - "నాయనా! నాగన్నా ! కొడుకులేనిలోటు నాకులేకుండా చేశావు మీరిద్దరూ హాయిగా ఒడుదుడుకులులేకుండాసుఖంగా సంసారాన్ని చక్కబెట్టుకుంటూండగా- చూస్తూ ఆనందంగా - అసువులు విడవగలగడం నా అదృష్టం - రా ! - అమ్మా - నీవుచాలా అదృష్టవంతురాలవు. - మీకు నేను చెప్పవలసినదేమీలేదు. ఒక్కటిమాత్రం జ్ఞాపకంఉంచుకోండి - అదే నా తుదికోర్కె. పొలాన్నిమాత్రం పాడు చేసుకోకండి, చీలికలుచేసివేయడం.... అమ్ముకోవడం... అలాటి అవివేకానికి దారివ్వకండి - మాతాతల నాటినుంచీ వస్తూంది. ఈపొలం ఆరుయకరాలుండేది, నాజీవితంలో యెనిమిదెకరాలు చేయగలిగాను. చీలికలుమాత్రం చేయబోకండి...." అంటూ ప్రాణంవదిలాడువెంకయ్యకాపు. భూమిమీద యెంతమమకారం !

యీనాడు రెండోవాడు దాన్నికూడా పంపకాలెట్టమని భీష్మించుకు కూర్చున్నాడు. పట్టణంలో చదువుతున్న మూడోవాడు సుబ్బారావుకికూడా

వెంటనే కలవుపెట్టి రమ్మనమని వ్రాశాడు. వెంకన్న వట్టిఅమాయకుడు. తమ్ముల్లా తనేం చదువుకుని వుద్యోగాలు చెయ్యకపోయినా పొలాన్నే కనిపెట్టుకుని వుండడంవల్ల పొలాన్నే ముక్కలుగా చేయాలంటే యెంతగానో బాధ పడ్డాడు; తండ్రితోటి అన్నాడుకూడాను, "ఆ వాటాలుకూడా నేనే సాగుచేసి పంట యెవరివాటా కొచ్చింది- వాళ్ళకి పంపకంచేస్తాను. చిన్నాడింకా చదువుకుంటూనే ఉన్నాడుకదా! పెద్దతమ్ముడు మేష్టరీచేసుకుంటూ పొలాన్నిలా చూసుకోగలడు. అదీకాక - యిన్నాళ్ళబట్టీకన్న తల్లిగాచూచుకుంటున్న గడ్డను - ఛిన్నాభిన్నలుగా చేయడానికి నామనసొప్పటంలేదు—" ఆమాటతల్చుకుంటేనే గుండె పగులుతోంది.

నాగన్నకీ ఆదేవుద్దేశం. వెంకయ్యకొపుకి పోయేటప్పుడు చేతులో చెయ్యివేశాడుకూడను. కాని.........అయితేనేం?—

నాగన్నకళ్ళు అప్రయత్నంగా మంచంక్రింద నున్నమడిలోనితులసితోటవేపుమళ్ళాయి. నాలుగు కన్నీటిచుక్కలు రాలాయి. చుక్కమ్మ బ్రదికి వుంటే యిలా - యీకుర్రాళ్ళని క్రుమ్ములాడుకో నిస్తుందా?—ఒకవైపు పుత్త్రవాత్సల్యం—మరొకవైపు తనను యీ స్థితిలోనికి తెచ్చిన వెంకయ్యకొపు తుదికోర్కె -రెండిటిమధ్యా సంధిగ్ధంతో నాగన్నబుర్ర బరువెక్కింది. యేమైనా సరే - తాను బ్రతికియుండగా భూమి పంపకం జరగడం అసంభవమని తేల్చుకున్నాడు. కాని—రెండోవాడు చదువుకున్న మూర్ఖుడుకదా!-బలవంతాన్ని పంచేసుకుని, ముక్కలు క్రిందతెగగొట్టేస్తే-? నాగన్న గుండెని ఒక్కసారిగా ముక్కలుచేసినట్టుగా బాధపడ్డాడు. ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోయింది. తుదినిర్ణయంతో బరువుగా గాలివదలుతూ అనుకున్నాడు - ఏమైనా సరే!—తనుండగా భూమిని చెక్కలు చేయనీయననీ, ఏవేవోనిశ్చయాలు సంకల్పించుకుంటున్నాడు నాగన్న—

కొట్టంలో యెడ్లనుకట్టి, గడ్డివేస్తూ - వెంకన్న తనువచ్చినట్టైనా గమనించకుండా అదోలా కూర్చున్న తండ్రినిచూచి ఆశ్చర్యపోయాడు. దేన్నిగూర్చి అంతదీర్ఘంగా ఆలోచిస్తున్నాడో— అతనికేమీ పాలుపోలేదు. మెల్లిగా నెత్తినున్న తలపాగా పంచనిదులుపుకుంటూ "యేంటయ్యా?- అలా అలోచిస్తూ కూర్చున్నావు?" అన్నాడు.

ఒక్కసారిగా నాగన్న భావనాప్రపంచంనుండి యీప్రస్తుతానికివచ్చాడు. యెదురుగా చెమటని కడుక్కుని తుడుచుకోంటున్న వెంకన్ననిచూచి లోలోపల యెంతగానో జాలిపడ్డాడు. తానుయింత సేపూ తర్కించుకున్న విషయంచెప్పి, వెంకన్న మనస్సుకూడా వ్యాకులపర్చడం యిష్టంలేక పోయింది

"అబ్బే! - యేంలేదురా. రెండు రోజుల్లో మిగతా మట్టిన్నీదున్నడం పూర్తవుతుందా? లేదా" అని.........మనస్సులోజరిగే కొట్లాటల్ని యెలాగో మరుగుపరచిఅన్నాడు. కాని....చిన్న వాడు పంపకంవిషయం జ్ఞప్తికివచ్చినప్పుడల్లా గుండె పగిలిపోతూంది నాగన్నకు.—

★

ఆనందవాణి
పోస్టుబాక్సు నెంబరు
1583
—మేనేజరు